క్లుప్తంగా

దుర్గామాతకు ప్రత్యేక పూజలు



మారికవలసలో పూజలు చేస్తున్న భక్తులు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డు మారికవలస ఆర్‌జీకే కాలనీలో దుర్గామాత మండపంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, నాయకులు జేఎస్ రెడ్డి, సూర్రెడ్డి, పాపారావు, అల్లాడ లింగేశ్వరరావు, పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు తదితరులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ మహిళా కార్యదర్శి డి.కావ్యారెడ్డి, శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భారీ అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



రాంబాబుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాం గ్రామానికి చెందిన వ్యక్తికి సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సాయం మంజూరైంది. శొంఠ్యాం గ్రామానికి చెందిన లెంక పార్వతి గత కొంత కాలంగా అనారోగ్యానికి గురై దీర్ఘకాలంగా చికిత్స పొందారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ద్వారా ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.6.50 లక్షల సాయం మంజూరైంది. ఈ మేరకు మంగళవారం తన క్యాంపు కార్యాలయం వద్ద బాధితురాలి కటుంబ సభ్యులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెక్కు అందజేశారు.

పోలమాంబ ఆలయంలో అన్నసంతర్పణ



అన్న సమారాధన ప్రారంభిస్తున్న ఈవో ప్రసాద్

తగరపువలస: ఇటీవల దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసినందున సంగివలస పోలమాంబ ఆలయంలో దేవదాయశాఖ మంగళవారం భారీ అన్నసంతర్పణ ఏర్పాటు చేసింది. కార్యక్రమాన్ని ఈవో బి.ప్రసాద్ ప్రారంభించారు. ఆలయ సిబ్బంది కోరాడ శ్రీను, తాటికొండ రాంబాబు పాల్గొన్నారు. నగరానికి చెందిన శ్రీహరి సేవా సమితి ప్రతినిధులు సహాయ సహకారాలు అందించారు.

అమ్మవారి మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలి ఎగువపేట వద్దనున్న మత్స్యకారుల ఆరాధ్య దైవం శ్రీపోలమాంబ అమ్మవారి మహోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం ఆవిష్కరించారు. ఉత్సవాలకు తన వంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. ఎగుపేట గ్రామాభివృద్ధి సేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపిల్లి నర్సింగరావు, కార్యదర్శి వాసుపల్లి కొండబాబు, కోశాధికారి బర్రి కొండబాబు, సభ్యులు అల్లిపిల్లి అప్పారావు, కారి చిన్నారావు, వాసుపల్లి దాసు పాల్గొన్నారు.

దివ్యాంగుల కోసం సదరం క్యాంపులు

నిర్వహించాలని వైద్యులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశం



రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న దివ్యాంగుడు



బాలాజీనగర్ సచివాలయం వద్ద వైద్య, ఆరోగ్య సిబ్బందితో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: చిట్టివలస, మధురవాడలో నెల రోజుల వ్యవధిలో సదరం క్యాంపులు నిర్వహించి అర్హులైన దివ్యాంగులకు సర్టిఫికెట్లు ఇప్పించాలని జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు వైద్యురాలు దుర్గా కల్యాణికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. అలాగే రూరల్ పరిధిలో ఈసీజీ పరీక్షలు నిర్వహించారని, జీవీఎంసీ పరిధిలో కూడా ప్రత్యేక క్యాంపుల ద్వారా ఈసీజీ పరీక్షలు చేసేలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లాలని ఆయన కోరారు. జీవీఎంసీ ఒకటో వార్డు బాలాజీ నగర్ సచివాలయ పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు.

ప్రతి ఒక్కరూ పైకి ఆరోగ్యంగా కనిపించినా శరీరంలో ఎలాంటి అస్వస్థత ఉందో తెలుసుకునేందుకు ఈ శిబిరాలు ఉపయోగపడతాయన్నారు. ముందుగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు వైద్య పరీక్షలు చేయించుకుని మిగతా వారిని కూడా శిబిరాలకు వచ్చేలా ప్రోత్సహించాలని సూచించారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్లలో ఏ ప్రభుత్వమూ ఇంటింటికీ వచ్చి వైద్య సేవలు అందించలేదన్నారు. ప్రభుత్వంలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తున్నవారు సేవా భావంతో పని చేయాలని కోరారు. సీబీఐ విశ్రాంత డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ, లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ వంటి వారు రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులవుతున్నారన్నారు. బాలాజీనగర్ సచివాలయం పరిధిలో ఈ నాలుగున్నరేళ్లలో రూ.10.30 కోట్ల సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో భీమిలి జెడ్పీ బి.రాము, ఏఎంవో శ్రీనివాసరావు, 1, 2 వార్డుల సచివాలయాల కన్వీనర్ జగుపల్లి ప్రసాద్, 2వ వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి, వైద్యులు దుర్గా కల్యాణి, గోవింద్, మౌనిక, సుష్మిత, ప్రియాక్షిత్, ఎచ్చెర్ల హరి, వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల వెంకట అప్పారావు, జగన్నాథ ఎల్లాజీ, చేట్ల నరసింగరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ పౌష్టికాహార ప్రదర్శనను ఎమ్మెల్యే ప్రారంభించారు.

సురక్ష క్యాంపులతో ఎంతో మేలు

మధురవాడ: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. అందుకే అందరికీ అత్యంత చేరువలో ఈ సేవలు అందించడానికి ప్రతి సచివాలయం పరిధిలో శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జీవీఎంసీ 5వ వార్డు బోయిపాలెం సమీపంలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎమ్ (పీపీ) - 1 కాలనీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. రోగులకు మందులు, కళ్లద్దాలు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో 5వ వార్డు జేసీఎస్ కన్వీనర్లు పోతిన సురేష్, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి పాల్గొన్నారు.

- జీవీఎంసీ 8వ వార్డు పెద రుషికొండలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పరిశీలించారు. ఉచితంగా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



పరదేశిపాలెంలో సత్కరించిన వైద్యులతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



పెద రుషికొండ ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



బాలాజీనగర్‌లో మందులు, కేస్‌షీట్లు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సస్య రక్షణతో వరి సంరక్షణ

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి, శింగనబంద పంచాయతీల్లోని వరి సంరక్షణకు అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు విశాలాక్షి, శిరీష, జిల్లా వనరులు కేంద్ర అదనపు సంచాలకుడు చదువుల సుబ్రహ్మణ్యం మంగళవారం పలు సూచనలు చేశారు. ప్రస్తుత వాతావరణంలో వరి పంటలో తెగుళ్లు, పురుగుల నుంచి రక్షణకు నివారణ సూచించారు. భీమిలి ఏవో బి.శివకోమలి, డీఆర్సీ ఏవో సీహెచ్.సురేష్, వ్యవసాయశాఖ సహాయకులు ఎల్.హరీష్, డి.భాగ్యరేఖ పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని బోని, గొట్టిపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు మంగళవారం పర్యటించారు. అక్కడ సాగు చేస్తున్న వరి పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు ఎం.విశాలాక్షి, ఎ.శిరీష, జిల్లా వనరుల కేంద్రం అధికారి సీహెచ్ సుబ్రహ్మణ్యం, వ్యవసాయాధికారులు సీహెచ్ సురేష్, సంధ్యారత్న ప్రభ బృందం రెండు గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి పొట్ట దశలో యూరియాతోపాటు పొటాష్ ఎకరానికి 20 కిలోలు వేయాలని సూచించారు. పొట్ట దశ నుంచి గింజ గట్టి పడేవరకూ 5 సెంటీ మీటర్ల నీరు పొలంలో ఉండేటట్టు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

భీమునిపట్నం: స్థానిక సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని టి.అనుప్రియ జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల అన్నమయ్య జిల్లా కె.వి.పల్లెలో జరిగిన అంతర్ జిల్లాల షూటింగ్ బాల్ పోటీల్లో అనుప్రియ ప్రతిభ చూపింది. ఈ మేరకు మంగళవారం పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ దీప, పీఈటీ నల్లా శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

వల్లభాయ్ పటేల్ అందరికీ స్ఫూర్తి



రన్ ఫర్ యూనిటీని ప్రారంభిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

కొమ్మాది: దేశ సమైక్యత కోసం గొప్ప సేవలు అందించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిప్రదాత అని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ వద్ద మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పటేల్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన జాతీయ సమైక్యత కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశ ఐక్యతకు వల్లభాయ్ పటేల్ చేసిన కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. అనంతరం రన్ ఫర్ యూనిటీని ప్రారంభించారు. గిరిజన సంక్షేమశాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చినబాబు, జోన్ - 2 కమిషనర్ కనక మహాలక్ష్మి పాల్గొన్నారు.

తగరపువలస: సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి రోజును జాతీయ సమైక్యత దినోత్సవంగా జరుపుకుంటున్నామని బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. మంగళవారం పాఠశాలలో ఆయన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి పాల్గొన్నారు. శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట పాఠశాలలో పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో పటేల్ జయంతి, ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా వారి చిత్రాపటాలకు నివాళులర్పించారు. మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు పాల్గొన్నారు. అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భీమునిపట్నం: దేశంలోని అన్ని కులాలు, మతాల వారు కలిసికట్టుగా ఉంటేనే అభివృద్ధి, ప్రగతి సాధ్యమని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల అన్నారు. జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాలలో ఆమె మాట్లాడారు. అప్పలనాయుడు, శ్రీను, రమణ పాల్గొన్నారు. జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్)లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, జిల్లా ఉప విద్యాశాఖ అధికారి గౌరీ శంకరరావు, వైస్ ప్రిన్సిపాల్ గొట్టేటి రవి, అధ్యాపకులు మాధవి, మహాలక్ష్మి, హరిణి పాల్గొన్నారు.

10 నుంచి చెకుముఖి సంబరాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ జ్యోతి కుమారి

మధురవాడ: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి చెకుముఖి సంబరాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.కె.పరశురామ్ తెలిపారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఈ వేడుకలకు సంబంధించి పోస్టర్‌ను విద్యాశాఖ ఆర్జేడీ జ్యోతి కుమారి, డీఈవో చంద్రకళ, సర్వశిక్ష అభియాన్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ ఈ నెల 10న పాఠశాల స్థాయి, 30న మండల స్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయి, జనవరి 27, 28 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు. చినగదిలి ఎంఈవో రవీంద్రబాబు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోటాన శ్రీనివాస్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు దేముడుబాబు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శేషగిరిరావు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనతో సర్వతోముఖాభివృద్ధి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన దక్షతతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పందలపాకలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో అనుభవం ఉన్న రాజకీయ నాయకులు ముఖ్యమంత్రులుగా పని చేసినా ప్రజల కోసం ఏ రోజూ ఆలోచించలేదని, దీంతో రాష్ట్రంలో పేదరికం అలాగే ఉండిపోయిందన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి మొదలు పెట్టిన సంస్కరణల ప్రస్థానాన్ని ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కొనసాగిస్తూ బడుగులకు ఆశాజ్యోతిగా మారారన్నారు. సుపరిపాలన అందిస్తూ అందరికీ అండగా నిలబడ్డారని కొనియాడారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం మాత్రమే రాజకీయ నాయకులు గ్రామాలకు వస్తారని... కానీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రం ప్రజల బాగోగులు తెలుసుకోవడానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులను ఇంటింటికీ పంపిస్తున్నారని వివరించారు. ఇంట్లో ఉన్న ప్రతి ఒక్కరి అవసరాలను తీర్చుతున్న మహా నాయకుడని మరలా సీఎంను చేసుకుంటేనే పేదల బతుకులు బాగుపడతాయన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. జగన్ మోహన్ రెడ్డి పాలనలో నిరుపేద కుటుంబాలు కూడా ధైర్యంగా బతుకుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు కొత్త లైన్ల కోసం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, కాలనీ స్థలాలు మంజూరు చేయాలని, లింకు రోడ్లు నిర్మించాలని కోరగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు వాటి పరిష్కారం కోసం అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ దవళ నాగేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, ఎంపీడీవో అడపా లవరాజు, ఎంపీటీసీ సభ్యుడు విజినిగిరి అప్పలనాయుడు, సువ్వాడ జగ్గారావు, సువ్వాడ నారాయణ, బొట్టా రామకృష్ణ, పినిశెట్టి సింహాచలం నాయుడు, మజ్జి రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమిలి ఏఎంసీ చైర్మన్ పదవీకాలం పొడిగింపు

తగరపువలస: భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ పదవీ కాలం మరోమారు పొడిగించారు. ఈ మేరకు పొడిగించిన ఉత్తర్వులను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంగళవారం సూర్యనారాయణకు అందించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ తనకు మారోమారు అవకాశం కల్పించిన ఎమ్మెల్యే శ్రీనివాసరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి మహేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.



సూర్యనారాయణకు ఉత్తర్వులు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

పీఎం పాలెం : స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ పెప్సీ ఫీడర్ ఏరియాలో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నందున విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు చేయడానికి బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆపరేషన్ జోన్ - 3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. బాబానగర్, విజేత సూపర్ మార్కెట్ ఏరియా, 45వ నంబరు సచివాలయం పరిధి, కారుషెడ్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని, స్థానికులు గమనించాలని సూచించారు.

ఫిర్యాదు చేస్తే అవినీతిపరులపై చర్యలు



ఆనందపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

ఆనందపురం : అవినీతి లేని సమాజాన్ని నిర్మించడానికి ప్రజలు మంచి మార్గంలో పయనించాలని అవినీతి నిరోధక శాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ రమ్య సూచించారు. విజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఆనందపురం, వేములవలస గ్రామాల్లో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమ్య మాట్లాడుతూ ఏ రంగంలో అవినీతి జరిగినా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదుదారుడి వివరాలు గోప్యంగా ఉంచి అతనికి రక్షణ కలిప్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ పథకాల్లో అవినీతి జరిగినట్టు తెలిస్తే 14400 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా తెలియజేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా నేత్తేరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు, అధికారులు ప్ల కార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాలయం ప్రత్యేకాధికారి చంద్రకళ, అవినీతి నిరోధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



రుద్రాక్షల అలంకరణలో కొత్తమ్మతల్లి



పసుపు కొమ్ముల అలంకరణలో రాస పోలమాంబ

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మవారిని నేపాల్ నుంచి తీసుకొచ్చిన 50 కిలోల రుద్రాక్షలతో మంగళవారం అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. తగరపువలసకు చెందిన పీఆర్ గుప్తా స్టేషనరీ షాపు యజమానులు పలివెల రాజశేఖర్, లలిత, సునీల్‌గుప్తా, షణ్ముఖ శ్రీహరి, హర్ష గుప్తా, కుందన ఆర్థిక సాయం అందించారు. సంతపేట రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో భీమిలి మండలం తాటితూరుకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా నిత్యం అలంకరణకు సహాయ పడుతున్న కుమార్, ఈశ్వరరావుతోపాటు దుంప శంకరరావును ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. భీమిలి మండలం మజ్జివలస పంచాయతీకి చెందిన రాస పోలమాంబ అమ్మవారిని రైతు రెడ్డి సంఘానికి చెందిన మహిళలు పిన్నింటి కుమారి ఆధ్వర్యంలో పసుపు కొమ్ములతో అలంకరించారు.

ప్రభుత్వ భూమి రక్షణకు చర్యలు



మధురవాడ రెవెన్యూ లే అవుట్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

మధురవాడ: విశాఖ రూరల్ మండలంలో 200 గజాల ప్రభుత్వ భూమి పరిరక్షణకు రెవెన్యూ అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. ఈ స్థలం వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. జీవీఎంసీ 8వ వార్డు రెవెన్యూ కాలనీలోని మధురవాడ సర్వే నంబరు 289లో ప్రభుత్వ గెడ్డ వాగు స్థలంలో 200 గజాలలో కొద్ది రోజుల క్రితం అనధికారకంగా ఒక షెడ్ ఏర్పాటు చేశారు.

దీనిపై ఉన్నతాధికారులకు స్థానికులు ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశాల మేరకు తొలగించినట్టు ఆర్ఐ ప్రవీణ్ కుమార్ చెప్పారు. ఇక్కడ సుమారు 800 గజాలు ప్రభుత్వ భూమిలో మరో ఆరు షెడ్లు ఉన్నట్టు గుర్తించామని, వారికి కూడా నోటీసులు ఇచ్చి తొలగిస్తామని ఆయన చెప్పారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని తెలిపారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



తాజ్ గేట్‌వే హోటల్‌లో పరిశీలిస్తున్న మహిళలు

తగరపువలస: నగరంలోని తాజ్ గేట్‌వే హోటల్‌లో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్స్ అండ్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ మహిళలను విశేషంగా ఆకట్టుకుంటోంది. పలు వస్తువులను ప్రదర్శనలో ఉంచారు. నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు, గృహిణులకు ఉపయోగపడేలా దేశ వ్యాప్తంగా 50కు పైగా డిజైన్లతో రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. జైపూర్, కోల్‌కత్తా, ముంబయి, ఢిల్లీ, అహ్మదాబాద్, చెన్నై, మధ్యప్రదేశ్, హైదరాబాద్ నగరాల నుంచి ప్రముఖ డిజైనర్లను తీసుకొచ్చి లేటెస్ట్ డిజైన్లతో వస్త్రాలను నగరవాసులకు పరిచయం చేస్తున్నామన్నారు. ఈ ప్రదర్శన నవంబర్ 2వ తేదీ 9 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

నరసాపురంలో రెండిళ్లు దగ్ధం



కాలిపోయిన ఇళ్ల వద్ద పోలీసు, బాధితులు

పద్మనాభం: మండలంలోని తునివలస పంచాయతీ నరసాపురంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకిళ్లు, వంటశాల దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.5లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. రీసు బంగారయ్య ఇంటిలో గ్యాస్ సిలిండర్ పేలడంతో బంగారయ్య ఇంటితో సహా ఇంటిలో ఉన్న అర తులం బంగారం, రూ.లక్ష నగదు, దుస్తులు కాలిపోయాయి. రీసు రాము ఇంటితో సహా ఇంటిలో ఉన్న తులం బంగారం, రూ.50 వేల నగదు, బీరువా, ఆధార్‌కార్డులు, గ్రైండర్ కాలిపోయాయి. బాధితులు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలారు. రీసు అప్పారావు వంట శాల కాలిపోయింది.

'సురక్ష' శిబిరం నేడు

మధురవాడ: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా బుధవారం జీవీఎంసీ 5వ వార్డు కొత్త పరదేశిపాలెం సచివాలయం వద్ద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు అధికారులు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు వైద్య నిపుణులు సేవలు అందించి ఉచితంగా మందులు అందజేస్తారని, అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కనులపండువగా అప్పన్న కల్యాణం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఉదయం ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.